తల్లి శీలాన్ని
శంకించిన
ఆ కూతురికి
తెలిసిన నిజం

# పవిత్ర గోదావరి

పచ్చిగోళ్ళ సుధ
కథ

సాయంత్రం ఆరు గంటలవుతోంది.

వర్షఋతువు కావడంవలన అప్పటికే చీకటిపడిపోయింది.

కాలువ గట్టుమీద చందు స్నేహ తప్ప ఎవరూ లేరు.

ప్రశాంతంగా ప్రవహించే కాలువ నీట్లో రాళ్ల విసురుతూ కూర్చున్నాడు చందు.

"చందూ!" తీయగా పిలిచింది స్నేహ.

"... ... ..."

"ఏయ్ చందూ! మాట్లాడవేం!"

"స్నేహా! ఇకముందు నేను మూగవాడ్నేగా!" దిగులుగా అన్నాడు.

"పిచ్చి చందూ! నా మనసెప్పుడూ నీతోనే వుంటుంది. నిన్ను వదలి వెళ్లిపోవడం నాకుమాత్రం ఇష్టం అనుకున్నావా! ఒక్క క్షణంకూడా నిన్ను చూడకుండా వుండలేని నా మనసుని అడుగు తెలుస్తుంది"

"స్నేహా! ఈ సృష్టిలో ఎన్నో నాకిష్టమైనవి వున్నాయి. అమ్మంటే నాకెంతో ఇష్టం. అయినా ఎప్పుడూ దాని దగ్గరగాకూడా వెళ్లలేకపోయేవాడ్ని పిరికితనంవలన! గులాబీలంటే ఎంతో ఇష్టం... గంట పూర్తికాకముందే వాడిపోయేవి! అయినా ఎందుకో నాకు అంతగా బాధ అనిపించేదికాదు. కానీ స్నేహా! నువ్వంటే నువ్వంటేనాకెంత ఇష్టమో తెలుసా, నువ్వు నాకు దూరమవుతున్నావని తలచుకుంటే... నేనెందుకో భరించలేకపోతున్నాను. ఈ శరీరంలోనుండి ప్రాణం బలవంతంగా పారిపోతున్నట్టనిపిస్తోంది.

"చందూ! అలా మాట్లాడకు! నీవలా మాట్లాడితే... నాకేడుపొస్తోంది" అంటూ



వే చందూ ముఖాన్ని రెండుచేతుల మధ్యకూ తీసుకుని ఎన్నెన్నో ముద్దులిచ్చింది.

చందు చంటిపిల్లవాడిలా ఆమె ఒడిలో పడుకుని, చేతులతో ఆమెనడుంని చుట్టేసి ''స్నేహా! నన్ను నీతో తీసుకుపో'' అన్నాడు.

''చందూ! కొన్నిరోజులు ఓపికపట్టు. తప్పకుండా మనకి మంచిరోజులొస్తాయ్. నీ

నీడలో బ్రతికే అవకాశం, అదృష్టం నేను పొందగలనన్న నమ్మకం నాకుంది.

చందు పెదవుల్ని చూపుడువేలితో రాసింది. మరికొంత కిందికి పోనిచ్చి విశాలమైన గుండెభాగాన గుబురుగా వున్న వెంట్రుకల పై సున్నితంగా ప్రేమ కావ్యాలు రాసింది.

చందు శరీరం, మనసు వేడెక్కాయి. ప్రేమ జ్వరంగా తీర్మానించుకున్నాక తృప్తిపడ్డాడు.

''స్నేహా! నువ్వు ఊరు వెళ్లాక రోజుకో లెటర్ వ్రాస్తావుకదూ! ఆ లెటర్‌తో నా మామూలు మర్చిపోవుకదూ!''

''నీ మామూలా... అంటే?'' ఆశ్చర్యంగా అడిగింది.

''ఏయ్... మొద్దూ! మామూలంటే తెలియని ప్రియురాలుకూడా ప్రియురాలేనా?''

''ఏమో బాబూ... ఇవన్నీ నాకు తెలియవు'' బుంగమూతిపెట్టింది.

చందూకి ఆమె అలా బుంగమూతి పెడితే చాలా ఇష్టం. గబుక్కున లేచి ఆమె పెదవుల్ని తన పెదవులతో నొక్కిపట్టాడు కసిగా!

తన పెదవులపై తడిని తుడుచుకుంటూ... ''ఏమైనా ఇంత ఉద్రేకం పనికిరాదు'' అంది.

''నేను మగాడ్ని'' అన్నాడు కళ్లెగరేస్తూ.

''తెలుస్తోంది మీసం వచ్చి చాలా రోజులయిందిగా''

''స్నేహా! మీ అమ్మగారికి అదేం సరదా... సంవత్సరమైనా ఒక ఊళ్లో స్థిరపడకుండా మరో ఊరు వెళ్లడం... నిజంగా...

''చందూ! అమ్మ సమాజానికి భయపడే వ్యక్తి. ఈ కాలం మనిషికాదు. తనకున్న ఆస్తి, అంతస్తు, పరువు, మర్యాద అన్నీ నేనే అనుకుంటుంది. ఎవరైనా మా గురించి ఒక్క మాట అనుకున్నారని తెలిసిన వెంటనే ఆ వూరునుండి మరో వూరు పయనమవుతుంది. ఎంత చెప్పినా వినదు.

''నీకేం తెలియదు. నువ్వూరుకో... చిన్నదానివి'' అంటుంది. ఆమె మనసు కష్టపెట్టలేక... ఆమె వెనుకే నేను వెళ్లక తప్పడంలేదు.

''ఈసారి నేనుకూడా నీతోనే వచ్చేస్తాను'' చిన్నపిల్లాడిలా మారాం చేశాడు చందు!

''ఆరోజు తప్పకుండా వస్తుంది చందూ! చివరిగా ఒక్కసారి నీ కౌగిట్లో దాచుకోవూ!'' గారంగా అడిగింది.

చందూ రెండుచేతులూ చాచి, కళ్లతోనే ఆహ్వానించాడు.

స్నేహ గబుక్కున అతన్ని గట్టిగా వాటేసుకుంది.

ఇద్దరూ తన్మయంగా...

హాయిగా...

నిమిషం...

రెండు నిమిషాలు...

మూడు నిమిషాలు గడిచిపోయాయి.

ఒకరి కౌగిలిలో ఒకరు మెత్తమెత్తగా కరిగిపోయి కన్నీటి రూపంలో వారి ప్రేమ ఇద్దరికళ్లలో ప్రవహిస్తోంది.

వారిద్దర్నీ చూస్తే కొమ్మని వీడలేని పూవులా అనిపిస్తుంది.

''చందూ! చాలా చీకటిపడింది. వస్తాను. అమ్మ కంగారుపడుతుంది'' అంది అతని కౌగిలిలోంచి తప్పుకుంటూ.

''స్నేహా! నన్ను మర్చిపోవుకదూ!''

"ఎవరైనా తనలో భాగాన్ని మర్చిపోతారే ంటి?"

"థాంక్యూ స్నేహా... థాంక్యూ... పద పోదాం" అంటూ ఇద్దరూ ఇంటిదారి పట్టారు.

☆ ★ ☆

తలుపు చప్పుడు విని ఊరగాయ జాడీల కు గుడ్డలు కదుతున్న పవిత్ర అవి వదలివెళ్లి తలుపు తీసింది.

"ఇంత రాత్రివరకూ ఎక్కడున్నావ్" చిరుకోపంతో అడిగింది పవిత్ర.

"అమ్మా! నేను చెప్పానుగా నా స్నేహితురా లు దగ్గరికి వెళతానని" ఏదో అనేసింది.

"రేపు తెల్లవారుజామున ప్రయాణం పెట్టుకుని, పెత్తనాలు చేస్తే ఎలాగ ఇవన్నీ సర్దుకోవద్దూ?"

"అమ్మా! ఒక్కమాట చెప్తాను బాధప డవుకదా! ఎవరో ఏదో అన్నారని ఇలా ఊరుమండే వెళ్లిపోవడం మన చేతకానితనాని కి నిదర్శనమవుతుంది. తప్పు చెయ్యకుండా మనం ఎందుకు భయపడాలమ్మా?"

"స్నేహా! నీకు తెలియదమ్మా... ఈ మనుషుల మనస్తత్వం! పెళ్లి కావలసిన పిల్లవి! ఇలాంటివారికి నువ్వు దూరంగా వుండాల మ్మా. నీ సుఖంకోసం నేనెన్ని కష్టాలైనా పడతాను. అందరి దృష్టిలో నా బ్రతుకులా కాకూడదమ్మా నీ బ్రతుకు" అంది.

"అమ్మా! ఈ సమాజానికి భయపడి ఎంత దూరం. ఎంత కాలం పరుగెత్తగలన మ్మా. ఇప్పటికే అలసిపోయిన నీ శరీరం, మనసు ఒక్కసారిగా వాటి గురించి ఆలోచిం చమ్మా"


"లేదమ్మా... లేదు... నా ఆలోచనం తా నా బంగారుతల్లికోసమే, ఇక నువ్వేం ఆలోచించకు, వంటింట్లో సామాన్లన్నీ అట్ట పెట్టెలోకి సర్ది పెట్టు" అంది పవిత్ర తన పని చేసుకుంటూ.

స్నేహ వంట ఇంట్లోకి నడిచింది.

పచ్చని పొలాలతో...

పిల్లకాలువలతో...

## లోటు



పక్క ఇంటినుండి సైగ చేసిన రమణి ఇంటికి ఆత్రంగా వెళ్లాడు హరి.

"ఏంలేదూ... మా ఆయన క్యాంపుకు వెళ్లారు. .. ఆయన లేనిలోటు తీరుస్తావని"

"తప్పకుండా... ఈ టైములో ఆయన ఏం చేసేవారు"

"రోజూ ఆయన చేసేపని బట్టలుతకడమేకదా.. . రా దొడ్లోకి" అందామె.

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)

అందమైన రామాపురంలోకి అడుగుపెట్టారు పవిత్ర, స్నేహ.

రాములవారి గుడిలోనుండి సుప్రభాతం వినిపిస్తోంది.

పవిత్రతకు ఆ వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

"ఈ ఊళ్లోనయినా స్థిరపడితే బాగుంటుంది" అనుకుంది.

"స్నేహా! ఊరు బాగుంది కదూ!" ముచ్చటపడుతూ అంది పవిత్ర.

"ఊరు బావుందమ్మా... ఊళ్లో మనుషులే బాగుండాలి" అంది బాధగా.

మరో ఐదు నిమిషాల్లో బండివాళ్లు వుండాల్సిన ఇంటిముందు ఆగింది.

బండి ఆగిన క్షణంలోనే... చుట్టుప్రక్కల అమ్మలక్కలంతా గుంపుగాచేరి పవిత్రను, స్నేహను మార్చి మార్చి చూస్తున్నారు.

"ఈ ఇంట్లో కొత్తగా దిగుతున్నవాళ్లు మీరేనా?" ఒకామె ప్రశ్న.

"మగదిక్కులేని సంసారం కాబోసు" మరో ఆమె అనుమానం.

"నీ ముఖం మగదిక్కు లేకపోతే... ఆమె బొట్టెందుకు పెట్టుకుంటుంది?" ఇంకొక ఆమె తీర్మానం.

పవిత్ర, స్నేహ మాట్లాడకుండానే లోపలికి వెళ్లిపోయారు.

"ఇక్కడకూడా మనం వుండలేమమ్మా... మరో ఊరు వెళ్లిపోదాం" స్నేహ వెటకరించింది.

"స్నేహా! నువ్వుకూడా మాటలతో నన్ను చంపకే" అంది బాధగా.

"అమ్మా! నీ మనసు మార్చుకోవాలనేనమ్మా నా కోరిక!"

"అది సరేకానీ... సామాన్లన్నీ లోపల పెట్టించి బండికి వాడికి డబ్బులిచ్చి పంపించు!"

స్నేహ బండివాడికి డబ్బులిచ్చింది.

ఇద్దరూ కలిసి ఇల్లంతా సర్దుకున్నారు.

పిలవకుండానే ఇరుగుపొరుగువారొచ్చి ఎవరికి తోచినమాట వారు అని వెళ్తున్నారు.

పవిత్ర స్నేహ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"ఈ ఊళ్లోకూడా వుండడం చాలా కష్టమే" అనుకున్నారు ఇద్దరూ.

☆ ★ ☆

కౌసల్యా సుప్రజ రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే...

గుళ్లోంచి సుప్రభాతం వినిపిస్తోంది. ఆరు గంటలయిందని సూర్యుడు కంగారుపడుతూ బయటకొచ్చాడు.

స్నేహ బిందె తీసుకుని నీళ్లకోసం కుళాయి కెళ్లింది.

ఊళ్లో ఆడాళ్లంతా అక్కడే వున్నారు. అన్ని కబుర్లూ అక్కడే!

ఒకామె అడిగింది స్నేహను "ఏమ్మా మీ నాన్న ఏం చేస్తాడూ?" అంటూ.

స్నేహకు ఏం చెప్పాలో తెలియలేదు.

"మా నాన్నలేరు. చిన్నప్పుడే పోయారు" ఎలాగో సమాధానం చెప్పేసింది.

"మరయితే... నుదుట ఆ బొట్టు?" మరోఆమె నోరుతెరిచింది ఆశ్చర్యపోతూ.

"ఆ... ఇప్పుడు బొట్టు, పూలు, గాజులు ఎవరు తీస్తున్నారు? కలికాలం ఫ్యాషన్లు... అయినా మనకెందుకూ?" ఇంకో ఆమె సాగదీసింది.

"పిన్నిగారూ! ఆవిడగారి తండ్రిగారు

చచ్చిపోలేదు. పెళ్లాన్ని ఎప్పుడో వదిలి వెళ్లిపోయాడని చెప్తోంది''

''అలాగా... అయ్యోపాపం...'' బుగ్గలు నొక్కుకుంది.

స్నేహకు అక్కడ వుండాలనిపించలేదు.

బిందె తీసుకుని ఇంట్లోకి పరుగెత్తింది.

జరిగిన విషయమేమీ తల్లితో చెప్పలేదు. తల్లి బాధపడుతుందని. 'నీళ్లు తేలేదేం' అని అడిగిన తల్లితో కుళాయి కట్టేశాడని అబద్ధ మాడింది.

రాత్రి పదిగంటలైంది.

స్నేహ, పవిత్ర మంచంపై వాలారు.

స్నేహకు నిద్రపట్టలేదు. పవిత్రమైన తన తల్లిని అందరూ అలా చులకనగా మాట్లాడ్డం భరించలేకపోతోంది. అమ్మగురించి వాళ్లకేం తెలుసు? తనకి తెలుసుండగా అమ్మ ఎలాంటి సుఖమూ పొందలేదు. లోకమంతా తనే అనుకుని పెంచింది. అమ్మ నిజంగా దేవత. ఆమె పవిత్ర తను గుర్తించలేని వీళ్లు నిజంగా మనుషులు కారు' అనుకుంది.

పవిత్రకి కూడా నిద్రపట్టడంలేదు. ఆమె ఆలోచనలు ఆమెకి! జీవితంలో తన స్నేహకు పెళ్లిచేయగలదా? తను వెళ్లిపోతే స్నేహను చూడ్డానికి ఎవరుంటారు? ఒంటరిగా ఈ సమాజంలో తను బ్రతకలేదు. తను వుండగానే స్నేహకి ఒక తోడు చూడాలి'' అనుకుంది.

రాత్రంతా ఆలోచనలతో ఇద్దరూ సరిగా నిద్రపోలేకపోయారు. ఎవరి మనసులోని బాధల్నివారు విషంలా మింగుతూ... ఒకరికొకరు అమృతాన్ని అందించుకోగల ప్రేమ మూర్తులు పవిత్ర, స్నేహ!

☆ ★ ☆

పవిత్ర గుడికి బయలుదేరింది. స్నేహ తల్లిని పంపించి తలుపు వేసుకుని లోపలికి రెండడుగులు వేసిందో లేదో... తలుపుమీద దబ దబ చప్పుడయింది. తల్లి ఏదైనా మర్చిపోయి తిరిగి వచ్చిందేమో అనుకుంటూ తలుపు తీసిన స్నేహ ఎదురుగా వున్న

## రికార్డు పడక



*గెరాల్డిన్ విలియమ్స్ అనే స్త్రీ 30 గంటలసేపు 340 మేకులు కొట్టిన పడకపై ఏకధాటిగా పడుకుని ప్రపంచ రికార్డు సృష్టించింది. పైగా 240 కేజీల భారీకాయం జాక్ మేక్ అనే పురుషుడ్నీ తన పొట్టపై కూచోపెట్టుకుంది. నిజంగా ఐరన్ ఉమన్ సుమండీ!*

— అచ్యుతుని రాజ్యశ్రీ

వ్యక్తిని చూసి నోటమాట రానిదానిలా మూగగా వుండిపోయింది.

"అప్పుడే నన్ను మర్చిపోయావన్నమాట"

"చందూ!" అమాంతంగా అతని కౌగిలిలోకి చేరిపోయి వెక్కి వెక్కి ఏడ్చేసింది స్నేహ!

"స్నేహ! ఏంటి చిన్న పిల్లలా! నాకు ధైర్యం చెప్పేదానివి. నువ్వే ఇలా అయిపోతే... నేనేమైపోవాలి? నీ ఒడిలో పడుకుని కరువుతీరా నేనేడ్వాలని వచ్చాను" అన్నాడు ఆమె తల నిమురుతూ.

"చందూ! నేను ఒక్క క్షణం కూడా ఈ ఒంటరితనం భరించలేను. ఈ శరీరం, మనసు ప్రతి క్షణం నువ్వు కావాలని మారాం చేస్తుంటే... మభ్యపెట్టడం నా తరంకాదు. చెప్పేస్తాను. అమ్మతో నిజం చెప్పేస్తాను"

"ఆవేశపడుకు స్నేహా... ఆలోచించు"

"ఆలోచించాను చందూ! నువ్వే నా ప్రాణం. నువ్వే నా జీవితం. నువ్వే నా సర్వస్వం. నువ్వే లోకం" అంటూ అతన్ని కసితీరా గట్టిగా కౌగిలించుకుని, పిచ్చిగా ముద్దులు పెట్టుకుని, ఇంకా ఆమె ప్రేమ తీరక కొరికి వదిలింది.

స్నేహ ప్రేమ పిచ్చిలో చందు శరీరం నలిగిపోయింది.

అయినా చందుకి తీయగానే వుంది.

స్నేహ ఆడపులిలా మరోసారి, మరోసారి అతనిపై వురికి ఆకలి తీర్చుకుంటోంది స్నేహప్రవర్తన చందూకి భయంకలిగించింది.

"స్నేహా! ఏమిటావేశం? లే... నన్ను ఊపిరి తీసుకోనీ" ఆమెను మామూలు మనిషిని చెయ్యడానికి ప్రయత్నించాడు తన కోరికలకు బలవంతంగా కళ్లెం వేస్తూ.

"చందూ! నా స్వీట్ చందూ! నన్ను అడ్డుపెట్టకు. ఇన్నాళ్ల దూరం... నేను భరించలేకపోయాను చందూ! నా అణువణువు నీకోసం పరితపించింది. నిన్ను చూస్తే... చందూ... ఓహ్... మాటలు రావడంలేదు. మెత్తమెత్తని నీ విశాలమైన గుండెభాగంలో ఎన్నో ప్రేమచరితలు వ్రాయాలని, చూశావా... నా పెదవులు ఎంత కంగారుపడుతన్నాయో?"

"స్నేహా! నన్ను రెచ్చగొట్టి పిచ్చివాణ్ని చెయ్యకు. ప్లీజ్... స్నేహా ప్లీజ్..."

"చందూ, నువ్వు నాక్కావాలి. నువ్వు నాక్కావాలి" పిచ్చిదానిలా ఏడ్చింది ఎంతోసేపు అతని గుండెల్లో గువ్వలావదిగిపోయి.

చందు ఆమెను బాగా దగ్గరగా తీసుకుని ఊరడించాడు.! ఆమె తల నిమురుతూ చంటిపిల్లను సాకినట్లు సాకాడు.

ఎప్పటికో స్నేహ మనిషయింది. చందు మీద తను పెంచుకున్న పిచ్చి ప్రేమ ఒక్కసారిగా ఉప్పెనలా చందూని ముంచేస్తుంటే... ప్రకృతికూడా భయంగా చూసింది.

మరో అరగంట తీపి తీపిగా కబుర్లు చెప్పుకున్నారు ఇద్దరూ.

"స్నేహా! ఇక నే వెళతాను. మళ్లీ వస్తాను. వీలైతే... మన గురించి అమ్మకు చెప్పు" అన్నాడు.

"మళ్లీ ఎప్పుడు?" అతని బుగ్గలమీద ఆమె చూపుడివేలితో గుండ్రాలు గీస్తూ అంది!

"తమరు తలచుకున్నప్పుడు" అన్నాడు కొంటెగా.

"పెద్ద గొప్ప... వెవ్వె... వ్వే" వెక్కిరించింది స్నేహ!

"స్నేహా... నా స్వీట్ స్నేహా... బై..." అంటూ వెళ్లిపోయాడు.

అతను వెళ్లిన ఐదు నిమిషాలకి పోస్ట్‌మేన్ లెటర్ తెచ్చి స్నేహాకి ఇచ్చాడు.

అది తల్లి పేరున వచ్చింది.

ఇంతవరకూ తను పుట్టి పెరిగాక తల్లికి ఎవరి దగ్గరనుండి ఉత్తరాలు రావడం తనకి తెలియదు. అయినా తమకి ఉత్తరాలు వ్రాసేవారు ఎవరున్నారని? అమ్మ అంటూ వుండేది 'నాకు నువ్వు, నీకు నేను, మనకి ఎవ్వరూ లేరమ్మా' అంటూ.

అలాంటిది ఈరోజు అమ్మ పేరుమీద లెటర్ వచ్చిందంటే... ఎవరై వుంటారు. స్నేహ ఇక కవరు విప్పకుండా వుండలేకపోయింది. ఒకరి ఉత్తరం మరొకరు చదవడం సంస్కారం కాదని తెలిసినా చదవడానికే నిర్ణయించుకుంది.

తలుపు గడియపెట్టి రూమ్‌లోకివచ్చింది.

కవరు విప్పి మొదటి వాక్యం చదువుతూనే కంపించిపోయింది.

ప్రియమైన పవిత్రా!


ఎలా వున్నావ్? నిన్నుచూసి ఎన్నాళ్లయిందో? ఒక్కసారికూడా నన్ను చూడాలనిపించలేదా? నేను చేసింది తప్పేనని ఒప్పుకుంటాను.

నువ్వు నా కళ్లకి కనిపించకుండా పెద్ద శిక్ష వేశావు. ఊరు మారావని తెలుసుకున్నాను. ఎలా తెలుసుకున్నానని ఆశ్చర్యపోకు. ఎప్పుడూ నిన్నేవెంటాడే నా కళ్లకు నువ్వెంత దూరంవెళ్లినా కనిపిస్తావు. ఈమధ్య బాగా చిక్కిపోయావు. ఆరోగ్యంజాగ్రత్త.

పవిత్రా! నా మామూలు ఎప్పుడిస్తావ్? ఈ జీవితం వెళ్లబుచ్చేలోపు ఒక్కసారి నిన్ను చూడాలని, నీతో మాట్లాడాలని నా ప్రాణం కొట్టుకుంటోంది. నా కోరిక మన్నించగలవా? మన స్నేహకు ముద్దులు.

వుంటాను

నీకు తెలుసు నేనెవరో...



ఉత్తరం అంతా చదివిన స్నేహ మనసులో అగ్నిపర్వతాలు బ్రద్దలయ్యాయి. ఆకాశం విరిగి మీదపడినట్లయింది. భూదేవి కంపించినట్టనిపించింది. ఎందరు ఏమనుకున్నా... తను మాత్రం తల్లిని మనస్ఫూర్తిగా నమ్మింది. దేవతలా కొలిచింది. మరి అమ్మ ఏం చేసింది! తనని మోసం చేసింది. అక్రమ సంబంధం వలనే తను పుట్టిందా! లేక అమ్మని అతను అన్యాయం చేశాడా, చేస్తే అమ్మ తనతో అలా ఎందుకు చెప్తుంది. నాన్న మతి స్థిరంలేక ఇంటినుండి వెళ్లిపోయాడని. అమ్మ తన దగ్గర అబద్ధం ఎందుకు చెప్పింది. అమ్మ నలుగురు అనుకునేవిధంగా... ఛ... ఛ... అమ్మ అలాంటిది కాదు.

కాకపోతే ఈ ఉత్తరం ఏమిటి. ఎంత ధైర్యంగా వ్రాశాడు. మామూలట. మామూలు తనని చందూ అడిగినప్పుడుకూడా తను ఎంత సిగ్గుపడిందని. మరీ వయసులో ఈ పరిస్థితిలో అమ్మని అతను మామూలు అడిగాడంటే ఎంత కామాంధుడై వుండాలి.

తను తన తల్లిగురించి నీచంగా ఆలోచిస్తోందా! లేదు. ఉత్తరమే తన తల్లిని తప్పుగా ఆలోచింపజేస్తోంది! అమ్మని అందరూ అనేక రకాలుగా అనుకుంటుంటే తను భరించలేకపోయేది. వాళ్లతో దెబ్బలాట పెట్టుకునేది... అలాంటిది... తనకి కూడా తెలియని ఒక నిజం... మనసుని దహించే చేదునిజం... బయటపడింది! అమ్మకి అతనికి సంబంధం ఏంటి? పవిత్ర బంధమే అయితే ఎదురై నలుగురిలో ధైర్యంగా బ్రతకొచ్చుగా... స్నేహ ఆలోచనలను దూరం చేస్తూ తలుపుమీద శబ్దం అయింది.గబగబా ఉత్తరాన్ని మడిచి జాకెట్లోకిపోనిచ్చి వెళ్లి తలుపుతీసింది స్నేహ.

"ఏమ్మా! ఇంకా అలాగే వున్నావ్? స్నానం చెయ్యలేదా?" అంటూ తను తెచ్చిన ప్రసాదం స్నేహచేతిలో వుంచింది పవిత్ర.

"ఊహు" అంది ముభావంగానే.

"అమ్మా... స్నేహా! ఈ రోజు దేవుని ముందు ఏం కోరుకున్నానో తెలుసా?"

"ఏం కోరుకుంటావ్? నీ మనసైనవాడు కనిపించాలని" మనసులోనే అనుకుంది స్నేహ. అంతలోనే తల్లిని అలా అన్నందుకు బాధపడింది.

"నీకు మంచి భర్త రావాలని" మళ్లీ పవిత్రే అంది.

"అమ్మా నీకా శ్రమ అక్కర్లేదు. ఎన్నో రోజులుగా చెప్దామనుకున్న నా మనసులోని మాట ఇప్పుడు చెప్తున్నాను. చందూ నేనూ ప్రేమించుకున్నాం. చందూ నా ప్రాణం. అతనే నా భర్త. "స్నేహ మాటల్లో దృఢత్వం కనిపిస్తోంది.

"ఆ... అనాథనా?"

"నేనుండగా చందూ అనాథ కాదమ్మా"

"స్నేహా! ప్రేమ వేరు... జీవితం వేరు. చందూకి వెనకా ముందూ ఎవ్వరూ లేరు. సంపాదన లేదు! అలాంటి వాడ్ని చేసుకుని ఏం సుఖపడతావ్?"

"నన్ను పోషించగలడన్న నమ్మకం నాకుందమ్మా... చందూలో నిజాయితీ వుంది. సంస్కారం వుంది. ఎదుటి మనిషి కష్టసుఖాలు పంచుకునే మంచి మనసు వుంది. అన్నిటికన్నా నాపై ప్రేమ వుంది"

"స్నేహా! ఈ అమ్మ మాట వినవా?"

"ఇంకేదైనా చెప్పమ్మా వింటాను. చందూలో ఏం తక్కువ. మనం ఆ ఊరు వెళ్లిన కొత్తలో అందరూ మనల్ని తప్పుకు తిరుగుతుంటే చందూయేనమ్మా... మనల్ని పలకరించేవాడు. నీకు ఒళ్లు తెలియని జ్వరం వస్తే ఆ కొత్త ఊళ్లో దిక్కులేనిదానిలా నీ ముందు కూర్చుని ఏడుస్తున్న నన్ను ఓదార్చి నీకు వైద్యం చేయించింది చందూయేనమ్మా..." ఆవేశంతో అంది స్నేహ.

"స్నేహా! ఏమయినా ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు" ఖచ్చితంగా అంది పవిత్ర.

"జరిగి తీరుతుంది" అంతకన్నా ఖచ్చితంగా అంది స్నేహ.

"తెలిసీ తెలియని వయసులో తీసుకున్న నిర్ణయాలు జీవితాన్ని చీకటి చేస్తాయి. స్నేహా... నా మాట విను. నా ప్రాణంగా పెంచాను. ఎవరూ లేని నాకు దీపం మవ్వనుకున్నాను. అలాంటి నన్ను బాధపెట్టకు.

"అమ్మా! నీకసలు ప్రేమగురించి తెలుసా?" వెటకరించింది.

"తెలుసమ్మా. లేకపోతే నిన్ను ఇంత ప్రాణప్రదంగా ప్రేమించలేనేమో!"

"అయితే... చందూకి నాకూ అడ్డురాకు"

"అమ్మా... స్నేహా..." పవిత్ర కళ్లలో నీరూరింది.

ఒకప్పుడైతే... తల్లి కళ్లలో నీటి పొర కనిపిస్తే గిలగిల్లాడిపోయే స్నేహకు ఇప్పుడేం అనిపించడంలేదు. ఆ ఉత్తరమే తన హృదయాన్ని కత్తితో కోస్తోంది.

"స్నేహా! చివరిసారిగా చెప్తున్నాను. చందూని మర్చిపో"

"నేనూ చివరిసారిగా చెప్తున్నాను. చందూనే చేసుకుంటాను.

"స్నేహా! నీకు తల్లంటే గౌరవం లేదు" ఏడుస్తూ అంది.

"వుండేదమ్మా ఒకప్పుడు ఈ ఉత్తరం చదివాక ఒళ్లంతా కంపరం ఎత్తుతోంది" అంటూ జాకెట్లో ఉత్తరం తీసి తల్లిమీదకు

## రంగు

హాస్పిటల్లో ఒకామెకు మగపిల్లాడు పుట్టాడు. ఆ పిల్లాడికి జుట్టు రాగి రంగులో వుంది.

"ఈ పిల్లాడి తండ్రికి జుట్టు రాగి రంగులో వుంటుందా" అడిగింది నర్స్.

"ఏమో... చీకటిలో సరిగా గమనించలేదు" చెప్పిందామె.

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



విసిరింది స్నేహ.

ఉత్తరం అంతా చదివిన పవిత్ర ఏదో చెప్పబోయింది. అయినా మాటలు రాలేదు. గొంతుమూగబోయింది. ఏదో చెప్పాలని పెదవులు తపించినా మనసెందుకో మాట లు రానీయక మొండికేస్తోంది.

''మాట్లాడమ్మా... మాట్లాడు. నన్నెం దుకు మోసం చేశావ్? మనకెవ్వరూ లేరని ఎందుకు చెప్పావ్? వాడెవడో నేను తెలుసు కోవాలమ్మా! మనిద్దరినీ ఇలా గాలికి వదిలిన దుర్మార్గుడ్ని చూడాలమ్మా. నన్ను నీ ప్రాణం అన్నావ్. మరెందుకు ఈ నిజం నా దగ్గర దాచావ్?'' స్నేహ కళ్లు ఎర్రగా అయ్యాయ్.

''అమ్మా స్నేహా! నిన్ను నేను మోసం చేయలేదు. నా ప్రాణంకన్నా ఎక్కువగా చూసుకున్నాను. ఈ ఉత్తరం విషయం సమయం వచ్చినప్పుడు చెప్తాను. అంతవర కూ ఓపిక పట్టమ్మా. నీ తల్లిని చెడ్డగా ఊహించకు. నేను భరించలేను. నిన్ను చూసుకుని బ్రతికే నాకు బ్రతుకే లేకుండా చేయకు.

''తప్పు చేయనప్పుడు ఎందుకమ్మా భయం? వాడెవడో నేను తెలుసుకుంటేగానీ ప చ్చి మంచినీళ్లుకూడా ముట్టను''

''స్నేహా!''

''చెప్పమ్మా!''

''భగవంతుడా! ఎందుకయ్యా నా జీవిత ంతో ఇలా ఆటలాడుతున్నావ్'' ఏడుస్తూనే చేతులు జోడించింది పవిత్ర.

''ఏడిస్తే... సమస్యలు తీరిపోవమ్మా'' అందరూ అనుకునేదే నిజమైతే ఈ జీవితం నాకక్కర్లేదమ్మా. ఇప్పుడే ఇక్కడే నీ కళ్లము ందే...''

''అమ్మా స్నేహా! అంత మాటనకు. చెప్తాను... అంతా చెప్తాను..''

''అమ్మా పవిత్రా! నువ్వుకాదు చెప్పేది నేను చెప్తాను'' అంటూ ఆ క్షణంలో అక్కడికి వచ్చిన అరవై ఏళ్ల తన్ని చూసిన స్నేహ ఆశ్చర్యపోయింది.

అంతకుముందెప్పుడూ అతన్ని చూడలే దు. తనకి తెలియని వ్యక్తి తన ఇంటి విషయాలు చెప్పడానికి రావడం స్నేహకు అర్థంకావడంలేదు.

''అమ్మా స్నేహా... నీ తల్లి పవిత్ర... పేరుకు తగ్గట్టుగా పవిత్ర గోదారమ్మా...! పవిత్ర పుట్టిన వెంటనే తల్లిని పోగొట్టుకుం ది. అమ్మా నాన్న తనే అయి తండ్రి ఆమెను పెంచాడు. ఇంట్లో అన్ని పనులు చేసుకోవడానికి లక్ష్మి వుండేది. ఆమె పవిత్ర పనులేకాకుండా పవిత్ర తండ్రి పనులుకూ డా స్వంతమనిషిలా చేస్తుండేది. రానురాను అతనికి లక్ష్మితో సంబంధం ఏర్పడింది. అతనివలన లక్ష్మి గర్భవతి అయింది. లక్ష్మి గర్భవతి అయిన వెంటనే పవిత్ర తండ్రిలో ఒక రకమైన భయం మొదలైంది. అంతవర కూ పరువుగా వున్న తన కుటుంబం వీధినపడితే భరించలేననుకున్నాడు. సమాజ ం వేలెత్తి తనని చూపితే సహించలేననుకు న్నాడు.

బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి లక్ష్మిని పిలిచి డబ్బు చేతిలో వుంచి మరో ఊరు వెళ్లిపొమ్మన్నాడు. లక్ష్మి అందుకు ఒప్పుకోలేదు. అతని కళ్లముందే తన జీవితం ముగిసిపోవాలని ఏడ్చింది. బిడ్డ అతనికి పుట్టినట్టు ఎవ్వరికీ చెప్పనంది. అయినా

పవిత్ర తండ్రి ఆమె ఇంట్లో వుండడానికి ఒప్పుకోలేదు. బలవంతంగా ఆమెను పక్క ఊరు పంపించేశాడు.

రోజులు గడుస్తున్నాయ్. నెలలు తరుగుతున్నాయ్.

ఒకరోజు లక్ష్మి మూడు నెలల గుడ్డును తీసుకొచ్చి పవిత్ర తండ్రి కాళ్లదగ్గరుంచి నేను ఈ లోకంనుండి వెళ్లిపోతున్నాను. నాకు అన్యాయం చేసినా ఈ పసిదానికి అన్యాయం చెయ్యకండి. కనీసం మీ ఇంట్లో పనిపిల్లగానైనా పెరగనీయండి'' అంటూ ప్రాధేయపడింది. అయినా అతని మనసు కరగలేదు. బలవంతంగా గెంటేశాడు. లక్ష్మి ఆ పసిగుడ్డును అతని గుమ్మంలో వదిలి కన్నుమూసింది.

పవిత్ర తండ్రి మనుషుల్ని పిలిచి ఆ పిల్లను ఎక్కడైనా వదిలిరమ్మని పురమాయించాడు. ఇదంతా అక్కడే వుండి చూస్తున్న ఇరవై ఏళ్ల పవిత్ర... ఒక్క ఉదుటున వచ్చి ఆ పసిదాన్ని అక్కున చేర్చుకుంది.

అప్పుడే మొదటిసారిగా తండ్రి ఎదుట నోరువిప్పింది...

"నాన్నా! నువ్వు చేసిన తప్పుడు పనికి లక్ష్మి ఒక్కర్తే శిక్ష అనుభవించింది. చనిపోతూ... నీ పాపాన్ని నీకు అప్పగించింది. నీలో పశ్చాత్తాపం కలిగితే... నీకు మనసుంటే ఆ పసిదాన్ని నీ బిడ్డగా పెంచు. అమ్మలేని నాకు అమ్మలేని బ్రతుకు ఎలా వుంటుందో తెలుసు. ఆ పసిదానికి అమ్మా నాన్నా లేకుండా చేయకు. అనాథగా ఆ పసి హృదయం ఏడుస్తుంటే ఆ ఏడుపు మన ఇంటికి శాపమే నాన్నా!'' అంటూ తండ్రికి అనేక రకాలుగా చెప్పిచూసింది!

అయినా ఆ తండ్రిమనసు మారలేదు.

"నాన్నా! నిన్ను నాన్నా అని పిలవడానికి కూడా అసహ్యంగా వుంది. కామంతో కళ్లు మూసుకుపోయి లక్ష్మి బ్రతుకుతో ఆడుకున్నప్పుడు నీకు ఈ సమాజం గుర్తురాలేదా? స్వంత మనిషిలా ఆమెతో సేవలు పొందినప్పుడు ఈ సమాజం గుర్తురాలేదా? నువ్వు

## ఆత్మ కథలు



ఈ మధ్యకాలంలో జీవితచరిత్రల జోరు బాగా వుంది. మాజీ రాష్ట్రపతి వెంకట్రామన్‌గారు, ఎన్నికల కమిషనర్ శేషన్‌గారూ తాము వ్రాసిన పుస్తకాల్లో రాజీవ్, అన్నాదురైల గురించి వ్రాసిన విషయాలు ఎంతో దుమారాన్ని లేపాయి. అవి చల్లారకముందే మాజీ రాష్ట్రపతి జైల్‌సింగ్‌గారు కూడా తన అనుభూతుల్ని ఈ మధ్యే డిక్టేట్ చేయడం మొదలుపెట్టారట! ఇప్పటికే ఎన్నో పబ్లిషింగ్ కంపెనీలు ఆ పుస్తకాన్ని మేం ముద్రిస్తాం అంటే మేం ముద్రిస్తామని క్యూలో నిల్చుంటున్నారు. చూద్దాం మరి జైల్‌సింగ్‌గారు ఏం రాస్తారో!

— జూపిటర్

చేసిన పనికి గర్భవతి అయిన ఆడదాన్ని డబ్బుతో తూకంవేసి నిర్దాక్షిణ్యంగా బయటకు గెంటేశావు. తొమ్మిది నెలలు నీ పాపాన్ని మోసి, కని, అలసిపోయి ఈ లోకాన్నే వదిలి వెళ్లిపోయిన ఆమెకు మనిషిగా నువ్వేం చేయగలిగావు? ఏది ఏమైనా ఈ పసిది అనాథ కాకూడదు'' దృఢంగా అంది.

పవిత్ర, తండ్రి ఈ విషయం గురించి రెండు రాత్రులు, రెండు పగళ్లు ఘర్షణ పడ్డారు. తండ్రి ఆ పసిదాన్ని పెంచడానికి ఎంతమాత్రం ఒప్పుకోలేదు. కనీసం ఆ పిల్ల కళ్లకు కనిపించకూడదన్నాడు. దాంతో పవిత్ర ఒక నిర్ణయానికి వచ్చి ఆ పిల్లను తీసుకుని, కొంత డబ్బు తీసుకుని ఆ ఊరువదిలి, తండ్రితో తెగతెంపులు చేసుకుని మరో ఊరు వచ్చేసింది.

తను పెళ్లిమాట మర్చిపోయి తన సుఖాలు మర్చిపోయి, అన్నీ ఆ పసిదే అనుకుని, సమాజానికి సమాధానం చెప్తూ ఆ పిల్లను ఇరవై ఏళ్ల కంటికి రెప్పలా కాచిన పవిత్ర మూర్తమ్మా నీ తల్లి. ఆ పిల్ల ఎవరో కాదు. నువ్వే! ఆ తండ్రి ఎవరో కాదు నేనే! అంటూ ఆగాడు.

"అమ్మా!'' మరి మాటలు రాలేదు స్నేహకు.

పవిత్ర గుండెల్లో పసిపాపలా కరిగిపోయింది స్నేహ.

"అమ్మా... అక్కవైన నువ్వు అమ్మగా నన్ను పెంచి నీ సుఖాలు వదులుకుని నాకోసం బతుకుతున్న నిన్ను అనరాని మాటలన్నానమ్మా... నన్ను శిక్షించమ్మా. నన్ను చంపేయమ్మా... నన్ను ఏదైనా చేసెయ్యమ్మా. పిచ్చిదానిలా ఏడ్చింది. జుట్టు పీక్కుంది స్నేహ.

"అమ్మా... స్నేహా! నువ్వు లక్ష్మి కూతురువన్న సంగతి నువ్వు నాచేతుల్లోకి రాగానే మర్చిపోయానమ్మా. నిన్ను నా బిడ్డగానే పెంచుకున్నాను. స్నేహా నువ్వు లేకపోతేనేనే లేనమ్మా'' అంటూ స్నేహను గుండెలకు హత్తుకుంది.

"అమ్మా... స్నేహా! నన్ను క్షమించమ్మా'' పశ్చాత్తాపంతో ఆ ముసలి హృదయం పడే ఆవేదన కన్నీటి రూపంలో మాధవరావు చెంపల్ని తడిపేశాయి.

"నాన్నా!'' అంటూ అతని గుండెల్లో ఒదిగిపోయింది స్నేహ.

ఇంత తెలిసినా ఇంకా ఏదో తెలియనిది మిగిలిపోయినట్టనిపించింది స్నేహకు. "మరి ఆ ఉత్తరం రాసింది ఎవరూ'' అడిగింది.

"నేనేనమ్మా... ఇన్నేళ్లూ పవిత్రకు దూరంగానే బతికాను. ఈ మధ్య ఎందుకో నా ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. రానురాను నా జీవితంమీద నమ్మకం పోయింది. ఈ ప్రాణం వుండగానే పవిత్ర కాళ్లమీద పడి క్షమాపణ అడగాలని ఆ ఉత్తరం రాశాను. నా నీడకూడా నీమీద పడడానికి ఒప్పుకునేదికాదు పవిత్ర. పవిత్ర నా కూతురు కాదమ్మా. వరాలిచ్చే దేవత. అందరికీ దాహం తీర్చే పవిత్ర గోదారి. బంగారు తల్లమ్మా నీ అక్క'' అంటుంటే అతని హృదయం భాష్పాంజలి అర్పించింది!

స్నేహ... పవిత్రవైపు ప్రేమగా చూసింది. ఆమెను కౌగిలించుకుని తనివితీరా ముద్దాడింది. 'దిక్కులేని నన్ను అమ్మగా చేరదీసి పెంచిన నీ అమ్మ మనసుకు ఏమిస్తే

ఋణవిముక్తి కలుగుతుందమ్మా?''

''స్నేహా! తల్లీ బిడ్డలమధ్య రుణాలేమిటి ?'' అంటుండగానే చందు అక్కడికి వచ్చాడు.

''రా నాయనా!'' అంటూ మాధవరావు చందూని ఆహ్వానించడం చూసి ''చందూ నాన్నగార్కి ఎలా తెలుసు?'' ఆశ్చర్యంగా అడిగింది.

''స్నేహా! చందూ ఎవరో కదమ్మా. నా చెల్లెలి బిడ్డ. నేను నీకు చేసిన అన్యాయాన్ని కొంతవరకు తుడుచుకోవాలని చందూని మీకు తెలియకుండా మీకు అండగా వుండమని పంపాను. విద్య, వివేకం, ఆస్తి, అంతస్తు అన్నీ వున్న చందూకి అమ్మలేదు. మామయ్య మాటే వేదవాక్కులా మీకు సాయంకోసమే మీరు వెళ్లిన ఊరు వచ్చాడు. మిమ్మల్ని పరిచయం చేసుకున్నాడు. నీ ప్రేమ పొందాడు. చందూ ఎవరో తెలియనంతకాలం పవిత్ర మీ ప్రేమను హర్షించి ఏం తెలియనట్టు ఊరుకుంది. చందూ ఎవరో పవిత్రకు ఈమధ్యే తెలిసింది. నామీద కోపంతో చందూని నువ్వు పెళ్లిచేసుకుంటానంటే పవిత్ర ఒప్పుకోలేదు అన్నాడు మాధవరావు.

''చందూ!'' స్నేహ అతని గుండెల్లో ఒదిగిపోయింది.

''స్నేహా! నన్ను క్షమించు. ఈ నిజం దాచినందుకు. మనందరి మధ్యా తెరలు తొలగిపోయాయి. ఇకముందు అంతా శుభమే!'' తథాస్తు నాయనా... ముహూర్తం చూసి మీ ఇద్దరి పెళ్లీ చేస్తాను'' అన్నాడు మాధవరావు.

''మామయ్యా! త్వరగా చెయ్యి. అసలే చలికాలం భరించలేకపోతున్నాను'' అన్నాడు చందూ క్రీగంట స్నేహను చూస్తూ.

పవిత్ర వారి మాటలకు నవ్వుకుంది.

''స్నేహా! ఐ లవ్ యూ'' అన్నాడు ఆమె దగ్గరగా వచ్చి.

స్నేహ చందూ చెవి పట్టుకుంది ఎవరూ చూడకుండా.



"ఏయ్ నా చెవి ఊడిపోతుంది" గట్టిగా అరిచాడు.

గలగల నవ్వులు.

"స్నేహా! అలా రా పనుంది" అంటూ తీసుకెళ్లి మామూలు అడిగాడు.

స్నేహ మునుపటిలా సిగ్గుపడలేదు. వెంటనే చందూ పెదవుల్ని తన పెదవులతో అందుకుంది.


"అమ్మా పవిత్రా! ఇలా రామ్మా..." అంటూ పిలిచారు మాధవరావు. "నన్ను క్షమించమ్మా, వయసొచ్చిన పిల్లని ఇంట్లో పెట్టుకుని మరో పిల్లతో కామంతో కళ్లు మూసుకుపోయి గడిపినందుకు ఇన్నాళ్లూ అనాథలా బ్రతికాను. ఈ శిక్ష చాలమ్మా. ఈ చివరిజీవితం నీ ఒడిలో తల ఆన్చి తనువు చాలించాలి. ఏ తండ్రీ నాలా కామాంధుడుకాకూడదమ్మా. నాకన్నా వయసులో చిన్నదానివైనా నీ సంస్కారం, త్యాగం నన్ను చిన్నవాణ్ని చేశాయమ్మా. నీలాంటి కూతురుంటే ప్రతి తండ్రి జీవితం ధన్యమేనమ్మా" అన్నారు ఏడుస్తూ.

"నాన్నా!" పవిత్ర తండ్రి ఒడిలో ఒదిగిపోయింది. ఇంవరకూ పవిత్ర అలసిపోయింది. ఆ అలసట తండ్రి ఒడిలో తీర్చుకుంటోంది.

"అమ్మా... పవిత్రా! నా మామూలు ఏదిరా?" ఎంతో ప్రేమగా అడిగారు మాధవరావు గతాన్ని కళ్లముందుకు తెచ్చుకుని.

పవిత్ర తండ్రిముఖాన్ని చేతులమధ్యకు తీసుకుని నుదుటున ముద్దిచ్చింది.

"అప్పుడే... ఓ గోరింక, రామచిలుక హాయిగా ఆకాశంలోకి ఎగిరిపోయాయి. ★



డిజైన్ : వి.నాగమణి (దేవునిపల్లి)